

# లంబోదర లకుమికరా...

కె.రాజశ్రీ మిసలూచని


నే నేనండోయ్ మీ ముద్దుల బొజ్జ గణపతిని నా పాత కథ అదేనండి పార్వతీదేవి పిండిబొమ్మ, శివుడి కోపం ఏనుగు ముఖం ఈ కథే చెప్పుకుంటున్నారు, మరి నా సరిక్రొత్త జన్మ గురించి తెలుసుకో నక్కరల్లేదు? లేటస్ట్ డాటా, మీ మీపీ-సీ ల్లోకి ఎక్కించుకోండి మరి!

ఎక్కడ కప్పాలో నరిగ్గా అక్కడే చినిగిపోయి, మాసిపోయి, జారిపోతున్న లాగూ నెగదోసుకుంటూ, నోట్లోని పుల్ల మిఠాయితో బాటే ముక్కు చీమిడినీ తన్మయత్మంతో చప్పరిస్తూ, మట్టిలో ఆడుకున్నాడు పదేళ్ళైనా బడి మొహం ఎరుగని కోటిగాడు. అమ్మా, నాయనా, ప్రొద్దున్నే నెత్తిన కుండలు మోసుకుని అమ్మకానికి పోయినారు. మూడేళ్ళ చెల్లి కమలను వాడికి అప్పజెప్పి, బురదలో కమలం అన్పిస్తూ ఆ పాప అన్నతో కల్సి మట్టిలో మహదానందంగా ఆడుకుంటున్నది తెల్లారినుంచీ కోటిగాడు ఇంత ముద్ద బంక మట్టితో ఓ బొమ్మ చేయాలని కుస్తీ పడుతున్నాడు కోటిగాడు. మధ్యాహ్నాంకల్లా ఓ మోస్తరు బొమ్మ తయారైంది. వాళ్ళ చింకి కొప్పెగిరిపోయేలా కమల ఏడవ సాగింది. ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చాడు. సెల్లికి బువ్వ పెట్టడం మరిసాడు. బొమ్మను వోరగా పెట్టి చేతులు కడుక్కుని చెల్లికి బువ్వ తినిపించసాగాడు.

సాయంకాలం అమ్మా, నాయనా, తిరిగొచ్చి బొమ్మను చూసి "మట్టంతా పాడు చేశావు కందరా" అని తాట వొలిసేస్తరని భయపడి, ఆ బొమ్మను మైన్ రోడ్డు దగ్గర క్రొత్తగా కడుతున్న బిల్డింగ్ లోపల ఉంచాడు. తిరిగి తిరిగి చూసుకుంటూ ఇల్లు చేరాడు.

మర్నాడు అమ్మా నాయనా బయల్దేరి పోయారో లేరో, చెల్లిని చంకన వేసుకొని ఆదుర్దాగా బిల్డింగు వైపు పరుగెట్టాడు. తాను దాచిన చోటంతా గాలించాడు. ఎక్కడా లేదా బొమ్మ. చౌకీదారు కేకవెయ్యడంతో, పరుగు లంకించాడు. నిరాశగా, ఉస్సురుమంటూ ఇల్లు చేరాడు.

ఆ రోజు ప్రొద్దున జరిగన సంగతి వాడికెలా తెలుస్తుంది? నన్నడగండి చెబుతాను. నేనేనండీ ఆ బొమ్మను ఏదో వి.ఐ.పి.ల ఫంక్షనని బిల్డింగ్ ఆవరణంతా శుభ్రపరిచారు. ఆ చెత్తనంతా భారతీయుల సహజమైన అలవాటు ప్రకారం, రోడ్డు మీద చెత్తకుండీలో కాక వీధంతా పరచుకునేట్లు పోసారు. నేనూ, ఆ చెత్తతోబాటు ఒక మూలకు, అదృష్టవశాత్తూ, ఫుట్‌పాత్ మీదకు విసరబడ్డాను. కాస్సేపటికంతా ఇటుకలు నింపిన ఒంటెద్దు బండిని తోలుతూ, అస్థిపంజరం నేనా, నువ్వా అన్నట్టు ఆ ఒంటెద్దుతో పోటీ పడుతున్నట్లుగా, రొప్పుతూ, రోజుతూ, వచ్చాడు



యాదయ్య. ఆ ప్రాణిని బరువునుండి విడిపించి తన జీవాన్ని ఫుట్‌పాత్ మీదికి చేర్చి, ఎముకల గూడు నిండా పొగ పీల్చి వదులుతూ, ఎంగిలి ఉమ్ముతూ, "నాల్గు ఇటకలు దస్కం సేస్తా, ఆ సేటు ముండా వాడిని ఏమార్చి" అంటూ పళ్ళు కొరుకుతూ యథాలాపంగా అటు, వైపుకు తిరిగాడు, అంతే బీడి పడేసి, చెంపలు పటపట వాయిస్తూ తప్పైపోనాది సామి అంటూ గుంజీలు తీసాడు. నన్ను చూసేనండీ వాడదిరి పడింది. అసలే ఓ మోస్తరు బొమ్మను, అందులో విసిరిపారేసినపుడు ఒక కాలు పైకి ఎత్తుకుంది, గుడ్డు పైకి తేలి, గమ్మత్తుగా తయారైంది నా రూపం. "ఇనాయకా దండం దండం, ఈ నాల్గు ఇటుకలూ నీవే పెట్టుకో - నన్ను కాపాడు' ' అంటూ నాకు నామకరణమే కాదు, నాల్గు ఇటుకలు పేర్చి, పీఠం వేసి ప్రతిష్టించాడు.





ఆ రోజంతా మధ్యాహ్నం ఎండనూ, సాయంకాలం చల్లదనాన్నీ భరిస్తూ, ఆకలి, దాహంతో బాధపడుతూ, కోపంతో, ఒంటి కాలెత్తి నిలబడ్డాను. నేనే, "ఉగ్రనర్తన" గణపతిని.


తెల్లవారసాగింది. చంక కింద గంపా, చీపురూ మహా స్టైలుగా ఇరికించు కొని కిళ్ళీ నములుతూ, రసం ఉమ్మేస్తూ, "ఎదవ సన్నాసి ఆపీసరుగాడు రోడ్డు ఊడవాలేంట - రోజూ ఊడవలాంటి! అయినా ఈ ఈదిలోని బోడి సన్నాసులు పొంగల్ అన్నా దీపాళి అన్నా ఒక్క రూపాయి ఈటానికి ఏడ్సి సస్తరు. ఎదవ పీనిగలు. కుప్ప మాత్తరం పోస్తరు ఈదంతా ఆపీసరుగాడింకా కొత్తమాలోకం-మామూళ్ళ సంగతి ఆడికేం తెల్పదింకా" అని అందరినీ తిడుతూ ఇంకాస్త పొగాకు తీసి నములు తూ క్రొత్తగా కుట్టించిన రైక బిగుతులు చూసుకొని మురిసిపోతూ, "ఈ రాంబాబు ఇంకా రాలేదే, వొచ్చాడంటే సినిమా హీరోలాగా ఏం డయలాగ్‌లు కొడ్తాడు. మొన్న ఆడితో సినిమాకెళ్ళినపుడు, సీకట్లో పమిటలోకి, చీర మడతల్లోకి, చెయ్యి పోనిచ్చి, తడిమి తడిమి ఏం అల్లరి సేసాడు. ఆ నా మొగుడు సచ్చినోడూ ఉన్నాడు ఎందుకూ ఓ సరసం నేదు - ఎప్పుడూ బూతులు, తాగుడు, తన్నులు అనుకుంటూ, లచ్చిమి చుట్టు కలియ జూసింది, రాంబాబు కోసం ఆమె కళ్ళకు నా రూపం కనబడింది. "అయ్యా నాయినో, గణపతి దేవుడా! నా మాటలన్నీ ఇనేసి నావా? నా మొగుణ్ణీ, ఆఫీసర్ని తిట్టి నానని ఎవరితో సెప్పమాక. నీకు మొక్కు తాను' అనుకుంటూ, నా చుట్టూనే కాక, ఆ రోడ్డంతా శుభ్రంగా ఊడ్చి, నాముందు నీళ్ళు జల్లి ఓ సున్నపు రాయితో ముగ్గుపెట్టి ఆ వైపున్న నాయర్ అంగడినుంచి తనకో టీ గ్లాసు, నాకో అరటిపండూ తెచ్చింది. నా ప్రాణం లేచి వచ్చింది. లచ్చుమి దండాలు పెడుతూ, పిరుదులు ఆడిస్తూ, నడిచి చక్కా పోయింది.

పది గంటల ప్రాంతానికి ఓ పిల్లాడు దిగాలుగా, తనకు రెండింతలు బరువున్న పుస్తకాల సంచీని మోస్తూ, అలసిపోయి, నా ప్రక్కనే చతికిలబడ్డాడు. "వినాయకుడా మా మిస్‌కు ఇవ్వాళ జ్వరం వచ్చేటట్లు చెయివూ టెస్ట్ పెడ్తుందట నేనేమీ చదవలేదు, సాయంకాలం వస్తూ పది పైసలు వేస్తా నీకు" అని గుంజీలు తీసి, ప్రదక్షిణం చేసి వెళ్ళాడు. నా అదృష్టం బాగుండి ఆ రోజు వాళ్ళ మిస్‌కు పెళ్ళి చూపులు జరగడం, అందుకని ఆమె లీవ్ పెట్టటం, పరీక్ష కాన్సిల్ అవడం, అన్నీ నా చలవే అని పొంగిపోయి ఆ అబ్బాయి విక్రం పదిపైసలతోబాటు ఓ బెల్లం ముక్క కూడా తెచ్చి నా ముందు పడేసి ఆనందంగా ఐస్‌క్రీమ్ నాకుతూ, ఇంటికి వెళ్ళడం, ఇలా ఇంకో భక్తుడు దొరికాడు.

లచ్చుమి రోజూ నాకు శ్రద్ధగా సేవలు చేయసాగింది. ఓర కళ్ళతో ఆమె వంటి పొంగులు చూడగల్గే అదృష్టమూ నాకు కల్గింది. ఒక వారం రోజుల తర్వాత సాయంకాలం లచ్చుమి పరిగెత్తు కొచ్చింది. "సామి, సామి, నువ్ సానా గొప్పోడివి, నానేంజేసినా సాలదు నీకు. నా మొగుడు పట్టపగలే తాగి, తందనాలాడి నడి రోడ్డులో లారీ క్రింద పడి సచ్చేడు. పీడ వదిలింది. నా ప్రేమను కాపాడావు సామీ" అని నాట్యం చెయ్యసాగింది. ఆ రోజునుండే ఆమెకూ, రాంబాబుకూ నా పంచనే వాసం. నా చుట్టూ తడికెలు గట్టి, వాళ్ళకో తడికెల గదివేసుకొని ఆ ఫుట్‌పాత్‌మీదనే వారి ప్రేమ జీవితం సాగించారు. వాళ్ళ సరసాలు కనీ, వినీ, నా బ్రహ్మచర్య వ్రతాన్ని సడిలించాలన్న నిర్ణయానికి వచ్చాను. నా ఇటుకల భక్తుడు నాకు చుట్టూ ఇటికెలతో గోడలెత్తిం చాడు. నాకు లంచం పెట్టి, తాను ఇటుకల వ్యాపారిని మోసం చేసి, యిప్పుడు యాదయ్య కూడా ఓ మోస్తరు ధనవంతుడయ్యాడాయె. ఇటుకుల గోడనుండి లచ్చుమీ రాంబాబుల సరసాలు చూడలేకపోయినా, విని, సంతోషించ సాగాను. 'ఉగ్రనర్తన సరస' గణపతి నయ్యాను. ఇంకో భక్తుడు నాకు రంగులు 'పులిమి, అలంకారాలు చేసాడు. రోజు రోజుకీ నా పాపులారిటీ పెరిగిపోయింది.

కొన్ని నెలలు గడిచాయి. పబ్లిక్ ఎన్‌క్రోచ్‌మెంట్ అంటూ మద్రాసు నగరంలో ఎక్కడ చూసినా బుల్ డోజర్ల ఉరుములే. నాకు తలకొచ్చింది తలపాగానూ వచ్చింది. నా భక్తులలో ఎమ్.పీ ఒకడు, నా గుడిని పగులగొట్టకూడదనీ నిరాహార దీక్ష చేసి, మత కలవరాల క్రిందకి విషయాన్ని దింపి, నా గుడిని కాపాడారు. నాకు వజ్రాల కిరీటం వజ్రాల ధంతం చేయించారు. విజయోత్సాహంతో. కానీ పాపం లచ్చుమీ రాంబాబుల పాక మాత్రం పీకేశారు. వాళ్ళు నన్ను వదలలేక వదలలేక వెళ్ళారు.




నా భక్త బృందంలో విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు నిరుద్యోగులు, వివాహితులు, అవివాహితులు, మంత్రులు, ఇలా చేరిపోయారు. నా చుట్టూ గోడలిప్పుడు టైల్స్‌తో మిలమిల మెరిసిపోతున్నాయి. అద్దాల కప్పు పైన నాకేం నేనిప్పుడు కోటీశ్వర్ల కొంగు బంగారాన్ని 'సరసాగ్ర నర్తన' గణపతి పాపులరయ్యాడు. నా కప్పుడప్పుడనిపిస్తుంది - కోటిగాడు నన్ను ఇప్పుడు చూస్తే ఎంత మురిసిపోతాడు అని కానీ అమ్మో, నా పుట్టు పూర్వోత్తరాలు వాడేమన్నా బయట చెబితే నా ఇమేజ్ ఏం కాను? ఏదో, లౌకిక జ్ఞానం ఉంది కాబట్టి కానరానివి కన్నా కననట్లూ, వినరానివి విన్నా విననట్లూ, నోరు మూసుకొని పడి వున్నాను కాబట్టి యింతటి వాడ్నయ్యాను. నా భక్తుంలే పాపం, గిల్టీగా ఫీల్ అవుతూనే ఉన్నారు కాబట్టే నాకిన్ని సమకూర్చారు. అహ లంచం అనకండి అన్నిటికీ పీనల్ ఫీ లేట్ ఫీ అని ఉన్నట్టుగా ఇది కూడా గిల్టీ ఫీ పశ్చాత్తాపం ఉంది కాబట్టే వాళ్ళు ఇస్తున్నారు, నేను పుచ్చుకుంటున్నాను తప్పంటారా! ఆ శివుడిచ్చిన ఏనుగు ముఖం కంటే, ఈ కలియుగ పురుషులు ఇచ్చిన ఈ అంతర్ముఖం ఎంతో నచ్చింది నాకు. నా భక్తులందరూ, నన్ను "ఆష్టైశ్వర్యాయురా రోగ్య సిద్ధి రస్తు" అని ఆశీర్వదించారు. నాకదే చాలు. ఎందుకండీ ఆ బరువు శరీరం, ఆ నడవలేని నడక, ఆ చంద్రుని ఎగతాళి, ఆ నిలాపనిందలు హాయిగా. వినాయక పూజ చేసుకోండి, నేను ఏ.సి. కార్లో వస్తాను, హాయిగా తింటాను. మరీ ఉండ్రాళ్ళే పెట్టి చంపొద్దండీబాబూ, మాడర్న్‌గా ఐస్‌క్రీములూ హాట్ పఫ్‌లూ, పెప్సీ కోలాలూ లాంటివి పెట్టండయ్యా చెప్పండి మీ సతీమణులకు వాళ్ళకూ పాపం పాత వంటకాలంటే చిరాకు నాకూ విసు గెత్తిపోయింది.

సరే, నన్నిలాగే ఉండనివ్వండి. త్వరగా ఒక ఏ.సి. గది కట్టించమని ఆ ముఖ్యమంత్రితో కలలో చెప్పి చూడాలి. ఉక్కపోస్తూందీ వెధవ మెడ్రాస్. ఆ పి.ఎమ్ ఇంకా మన లైన్లో పడలేదు పడితే, కులుమనాలికీ నా మకాం మార్చుకుంటాను.